ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH
Thursday , January 29, 2009



# ధర దక్కదు... దైన్యం తీరదు

## మద్దతు కొరవడి రైతుల అలజడి

పి. వి. సుబ్బయ్యచౌదరి






వ్యవసాయ ఉత్పత్తులకు అందజేసే కనీస మద్దతు ధర రైతుల ఆర్థిక స్థితిగతుల్లో కీలక పాత్ర పోషిస్తోంది. వివిధ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరల నిర్ణయానికి అనుసరిస్తున్న విధానం ఆయా వర్గాల నుంచి, ముఖ్యంగా రైతు సంఘాలు, రైతుల నుంచి విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ అంశంపై అధ్యయనానికి కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ 2003 మే 7న ప్రొఫెసర్ వై. కె. అలగ్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ 2005 మే 31న నివేదిక సమర్పించింది. కమిటీ చేసిన ప్రధాన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల తరవాత, ఈ నెల (జనవరి) 15న తిరస్కరించింది. ఈ నేపథ్యంలో- వ్యవసాయ వ్యయాల పథకం ఆవిర్భావం; అట్టడుగు స్థాయిలో వ్యవసాయ వ్యయాలు రాబట్టుకోవడంలో లోటుపాట్లు; వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరల నిర్ణయానికి అనుసరిస్తున్న పద్ధతి; వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ (సి.ఎ.సి.పి.) పాత్ర; కీలక సిఫార్సుల తిరస్కరణ పర్యవసానాలు, సంబంధిత అంశాలను విశ్లేషించాల్సిన అవసరం ఉంది.

## మార్కెట్ మాయాజాలం

మన దేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పుడు వ్యవసాయ రంగం ఎదుగూ బొదుగూ లేకుండా స్తబ్దుగా ఉంది. 1950లో ప్రారంభమైన ప్రణాళిక ప్రక్రియ వ్యవసాయ రంగంలో వృద్ధికి అనువైన విధాన రూపకల్పనకు దోహదపడింది. మొదటి మూడు ప్రణాళికల్లో ప్రధానంగా వ్యవసాయ సంస్కరణలపై దృష్టి కేంద్రీకరించారు. వ్యవసాయ వృద్ధికి అది తోడ్పడింది. వరి, గోధుమల ఉత్పత్తి, సరఫరా పెరగడంతో వ్యాపారులు మార్కెట్ మాయాజాలానికి పాల్పడ్డారు. సరళమైన ఆర్థిక పరిభాషలో చెప్పాలంటే ఉత్పత్తి, సరఫరాలు పెరిగినప్పుడు సరకుల ధరలు తగ్గాలి. అప్పట్లో అందుకు భిన్నంగా జరిగింది. దరిమిలా, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరలు ఇచ్చి రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడింది. మార్కెట్లో జోక్యానికి సంబంధించి పలు వ్యూహాత్మక పథకాలు ప్రారంభించింది. అందులో భాగమే కనీస మద్దతు ధరల పథకం. వరి ధాన్యం, గోధుమల ధరల నిర్ణయంపై ఆహార, వ్యవసాయ మంత్రిత్వశాఖకు సలహాలిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం 1964 ఆగస్టు ఒకటిన ప్రధానమంత్రి కార్యదర్శి ఎల్. కె. ఝా అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ధరల నిర్ణయం అంశాన్ని తరవాత ముతక

ధాన్యాలకూ వర్తింపజేశారు. ధరలు న్యాయబద్ధంగా, లాభసాటిగా ఉండేలా సలహాలు ఇవ్వవలసిందిగా కమిటీని కోరారు. వివిధ వ్యవసాయ ఉత్పత్తులకు నిరంతరం న్యాయబద్ధమైన, లాభసాటి ధరలు నిర్ణయించేందుకు వ్యవసాయ ధరల కమిషన్ పేరుతో శాశ్వత సంస్థను ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వం 1965లో నిర్ణయించింది. 1985లో దాని పేరును వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ (సి.ఎ.సి.పి.)గా మార్చారు.

వ్యవసాయ, ఉత్పత్తి వ్యయాలు; వ్యయ పరిమాణాలు, తీరుతెన్నుల వివరాల సేకరణ కోసం భారత ప్రభుత్వం వివిధ పంటలకు కనీస మద్దతు ధరల విధానాన్ని ప్రకటించకతప్పలేదు. అన్ని రాష్ట్రాల్లో ఏకరూప పద్ధతులను అనుసరించాలంటే- ప్రధాన పంటలన్నింటికి సంబంధించి వ్యయ అంచనాలను నిరంతర ప్రాతిపదికపై రూపొందించడం తప్పనిసరైంది. డాక్టర్ అశోక్ మిత్రా సారథ్యంలోని సాంకేతిక స్థాయీ సంఘం ఈ అవసరాన్ని గుర్తించింది. 'భారత దేశంలో ప్రధాన పంటలు పండించేందుకు అయ్యే వ్యయాల అధ్యయనానికి సమగ్ర పథకం (సి.ఎస్.)' ప్రారంభించాలని 1967లో సిఫార్సు చేసింది. ఈ సిఫార్సుకు అనుగుణంగా వ్యవసాయ మంత్రిత్వశాఖ అర్థగణాంక విభాగం (డి.ఇ.ఎస్.) 1970-71లో పూర్తి స్థాయి కేంద్ర పథకంగా దీన్ని ప్రారంభించింది. అప్పటి నుంచి 19 రాష్ట్రాల్లో ఈ పథకం అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది. మొదట్లో వరి, గోధుమలే ఈ పథకంలో ఉన్నప్పటికీ- కనీస మద్దతు ధర ఖరారు చేయాల్సిన అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని తరవాత ఇతర ప్రధాన పంటలనూ అందులో చేర్చారు. ప్రస్తుతం 25 పంటల విషయంలో కనీస మద్దతు ధరల విధానం అమలు చేస్తున్నారు. సమగ్ర విధానంలో లోపాలు ఉన్నాయని, దాని అమలు తీరు పక్కాగా లేదని విమర్శలు వచ్చిన దరిమిలా పంటల వ్యయ అంచనాలకు సంబంధించిన విధి విధానాలు తదితర అంశాల సమీక్షకు ప్రభుత్వం 1980లో డాక్టర్ ఎస్.ఆర్.సేన్ అధ్యక్షతన నిపుణుల ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. డాక్టర్ సేన్ కమిటీ చేసిన సిఫార్సుల్లో రెండు కీలకమైనవి. నమూనా కోసం ఏదో ఒక పంటను కాకుండా వివిధ రకాల పంటలను పరిగణనలోకి తీసుకోవాలన్నది మొదటి సిఫార్సు. రెండో సిఫార్సు క్షేత్రీయ కార్యక్రమ పర్యవేక్షణకు సంబంధించినది. ప్రతి అయిదుగురు క్షేత్ర కార్యనిర్వాహకులకు ఒక పర్యవేక్షకుడిని నియమించడం ద్వారా మార్గదర్శక, పర్యవేక్షక వ్యవస్థను పటిష్ఠం చేయాలని కమిటీ సూచించింది. భారత దేశంలో ప్రధాన పంటల వ్యయాల అధ్యయనానికి సవరిత సమగ్ర పథకాన్ని ప్రభుత్వం 1981-82లో ప్రవేశ పెట్టింది. మొదటి పథకం కన్నా ఇది మెరుగైనదే అయినప్పటికీ- శ్రమ శక్తికి విలువ కట్టడం, భూమి కిరాయిని గణించడం, యాజమాన్య వ్యయాల వంటి విషయాల్లో వివాదాలు కొనసాగాయి. దానిపై ప్రభుత్వం 1990లో ప్రొఫెసర్ సిహెచ్.హనుమంతరావు నేతృత్వంలో మరో నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. వ్యవసాయశాఖ అర్థగణాంక విభాగం పంట వ్యయాల అంచనాకు ప్రస్తుతం అనుసరిస్తున్న విధానానికి ప్రాతిపదిక ఆ కమిటీ సిఫార్సులే.

కనీస మద్దతు ధరల పథకం కింద రూపొందించిన విధి విధానాలు సమగ్రంగా ఉన్నట్లే కనబడుతున్నప్పటికీ, ఈ పథకంలోని ఏ నిబంధననూ సక్రమంగా ఆచరణలో పెట్టలేదు. పైగా స్ఫూర్తికి విరుద్ధంగా, రైతుల ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా వాటిని వాడారు. లోటుపాట్లను పరిహరించి పంటల వ్యయపథకం విధివిధానాల్లో పారదర్శకత తీసుకువచ్చేందుకు సంస్కరణలు చేపట్టాలని పలు కమిటీలు సిఫార్సు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. రైతులకు మద్దతు ధరలు దక్కలేదు. వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ సిఫార్సు చేసిన కనీస మద్దతు ధరలు తప్పనిసరిగా అమలు చేయాల్సినవికావు. దాంతో విధాననిర్ణేతలు రైతుల వాస్తవిక వ్యయాలను పరిగణనలోకి తీసుకొనకుండా రాజకీయపరమైన మద్దతు ధరలు ప్రకటించనారంభించారు. దాంతో రైతు సంఘాల వారు, రైతులూ గళమెత్తారు. వ్యవసాయ వ్యయాల పథకాన్ని పారదర్శకంగా రూపొందించి, వ్యవసాయ ఉత్పత్తులకు ప్రోత్సాహక కనీస మద్దతు ధరలు ఖరారు చేయడానికి వీలుగా వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్‌కు చట్టబద్ధ హోదా కల్పించాలని కోరారు. దరిమిలా ప్రభుత్వం అలగ్‌కమిటీని ఏర్పాటు చేసింది. వివిధ పంటలకు కనీస మద్దతు ధరల ఖరారుకు సంబంధించి విధివిధానాలను అధ్యయనంచేసి, సుంకాల విధానంపై సలహాలు ఇచ్చే బాధ్యతను కమిటీకి అప్పగించారు. వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ (సి.వి.సి.పి.)కి చట్టబద్ధ హోదా కల్పించడంపై కమిటీ చేసిన కీలక సిఫార్సులను ప్రభుత్వం కరాఖండిగా తోసిపుచ్చింది. ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయం రైతులకు, రైతు సంఘాలకు ఆగ్రహం కలిగించింది. ప్రభుత్వం సి.వి.సి.పి.కి చట్టబద్ధ హోదా కల్పించి ఉంటే, వ్యవసాయ ఉత్పత్తుల ధరలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి వీలయ్యేది. అలా చేయకపోవడంవల్ల కనీస మద్దతు ధరలను పెంచే అవకాశం దానికి లేకుండా పోయింది. రైతుల ప్రయోజనా

లకు విఘాతం కలిగినా సరే, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు, సుంకాల విషయంలో తన పట్టు సడలరాదన్నదే ప్రభుత్వ సంకల్ప మని దీన్నిబట్టి స్పష్టమవుతోంది. రైతులు వ్యవసాయోత్పత్తులు చేయాలికానీ, వాటికి ప్రోత్సాహక ధరలు ఆశించరాదని ప్రభుత్వం కోరుకొంటున్నట్లు కనిపిస్తోంది. ప్రొఫెసర్ ఎం.ఎస్.స్వామినాథన్ సారథ్యంలోని జాతీయ రైతు కమిషన్ (ఎన్.సి.ఎఫ్.) సిఫార్సు లను, వ్యవసాయంపై పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సులనూ ప్రభుత్వం పక్కన పెట్టడమే ఇందుకు రుజువు. రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం మరోసారి పాతరేసిందనేది నిస్సందేహం.

## ప్రమాదంలో ఆహారభద్రత

న్యూఢిల్లీలోని అర్థగణాంక విభాగం (డి.ఇ.ఎస్.) వివిధ రాష్ట్రాల్లో వ్యవసాయ విశ్వవిద్యాలయాల ఆధ్వర్యంలో పనిచేసే కేంద్రాల ద్వారా ఆయా పంటల వ్యయాలకు సంబంధించి గణాంక వివరాలు సేకరిస్తుంది. కానీ ఈ ప్రక్రియ రైతుల వాస్తవ వ్యయాలను ప్రతిఫలింపజేయడంలేదు. పంట వ్యయాలకు సంబంధించి గణాంక వివరాల సేకరణకు నియమించిన సిబ్బందిలో పారదర్శకత, జవాబుదారీతనం, బాధ్యతా కొరవడ్డాయి. కుటుంబమంతా కలిసి పనిచేస్తున్నా, పశువులూ పనిలో భాగం పంచుకొం టున్నా, ఇతరత్రా ఎంతో శ్రమశక్తి వినియోగమవుతున్నా - వ్యవసాయ వ్యయాల్లో దాన్ని గణించడం లేదు. రైతులకు కానీ, రైతు సంఘాలకు కానీ ఇలాంటి పద్ధతి ఉందని తెలియదు. ఉత్పత్తి వ్యయాలు ఎక్కువగా ఉన్నాయని నిర్ధారించిన సి.ఎ.సి.పి. ఆ మేరకు కనీస మద్దతు ధర చెల్లించాలని సిఫార్సు చేసినా- కేంద్రప్రభుత్వం మోకాలడ్డుతోంది. సి.ఎ.సి.పి.కి చట్టబద్ధ హోదా లేక పోవటంతో ఎంతమాత్రం ప్రోత్సాహకరం కాని కనీస మద్దతు ధరలు నిర్ణయిస్తోంది. రైతులు పంట ఉత్పత్తులను అయినకాడికి అమ్ముకోకుండా ఉండాలంటే కనీస మద్దతు ధరలు హేతుబద్ధంగా ఉండాల్సిందే. అందుకు అనుగుణంగా మద్దతు ధరల వ్యవస్థ నంతటినీ ప్రక్షాళన చేసి, పారదర్శక విధానాలు రూపొందించాలి. ఆ ప్రక్రియలో రైతు సంఘాల ప్రతినిధులకు భాగం కల్పిం చాలి. సి.ఎ.సి.పి.కి చట్టబద్ధ హోదా ఇవ్వాలి. వ్యవసాయ ఉత్పత్తులకు ప్రోత్సాహక కనీస మద్దతు ధరలు లేకపోవడంవల్ల లక్షల సంఖ్యలో రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో చిక్కుకుంది. దేశ ఆహార భద్రత ప్రమాదంలో పడింది. పరిస్థితి చక్కబడాలంటే ప్రభుత్వం తక్షణం దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. వ్యవసాయ స్థాయీ సంఘం, అలగ్ కమిటీ, స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సుల అమలుకు కృషిచేస్తామని హామీ ఇచ్చే అభ్యర్థులకే వచ్చే ఎన్నికల్లో ఓటువేయడం ద్వారా బ్యాలెట్ శక్తిని రైతులోకం చాటుకోవాలి.

**(రచయిత భారతీయ రైతు సంఘాల సమాఖ్య సలహాదారు)**